# నిచ్చెన మెట్టు

**ధనార్జనే జీవితానికి పరమావధి అని తలచేవాళ్ళు జీవితంలో పైకెదగడానికి స్నేహాన్ని సైతం నిచ్చెన మెట్టుగా వాడుకొంటారు. ఆస్తులు కూడబెట్టలేని మధ్యతరగతి వారు ఇలా నిచ్చెన మెట్లుగా ఉపయోగపడినా, మానవ విలువలను కోల్పోనంత కాలం కష్టాలతో కాపురం చేయగల నిబ్బరం వరంగా లభిస్తుంది**

సార్! మీకోసం రంగనాథ్ అని ఎవరో వచ్చార్సార్" అన్నాడు ప్యూన్ రంగయ్య. చూస్తున్న ఫైలు మూసేసి పక్కన పెట్టి లేచాను. రిసెప్షన్ హాల్లోకి నడిచాను.

అక్కడే సోఫాలో కూర్చున్న రంగనాథ్ నన్ను చూడగానే సంతోషంగా లేచి కుడి చేతిని ముందుకు చాచి కరచాలనం చేస్తూ, "ఏరా రంగా! ఎలాగున్నావ్" అని మొదట కుశల ప్రశ్నను విసిరాడు. సోఫాలో అతని పక్కనే కూర్చుంటూ "బాగున్నాన్రా" అన్నాను.

"గుడ్" అన్న రంగనాథ్, "నువ్వు ఊహించి కూడా ఉండవు నన్నిలా చూస్తావని కదూ!" నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"అవును. నిజంగా ఊహించలేదు. అయిదేళ్ళ క్రితం అమెరికా వెళ్ళినప్పుడు నువ్వు రాసినవి రెండే ఉత్తరాలు. వాటికి నేను జవాబు రాశాను. తరువాత నీ ఉత్తరం రాలేదు. నాలుగేళ్ళు నీకూ నాకూ మధ్య ఏవిధమైన పలకరింపులూ లేవు. ఇప్పుడు నిన్ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందిరా" అన్నాను.

"అవును. వెళ్ళిన కొత్తల్లో రెండే ఉత్తరాలు రాయగలిగాను. ఆ తరువాత ఉద్యోగరీత్యా, వ్యాపకాల రీత్యా బిజీ అయిపోయాను. చెయ్యాలనుకున్నా చాలా పనులను చెయ్యలేకపోతూ వాయిదా వేసుకునేవాణ్ణి. కానీ, మనసులో మాత్రం కొందరి గురించి అప్పుడప్పుడు అనుకునేవాణ్ణి. ఆ కొందరిలో నువ్వు కూడా ఉన్నావు. ఇంట్లో అందరూ కులాసానా? మీకు అబ్బాయా? అమ్మాయా" అడిగాడు రంగనాథ్.

"అమ్మాయే. రెండోక్లాసు చదువుతోంది." చెప్పాను.

"నీకు ఆఫీసు ఎప్పుడు అయిపోతుంది. అయిదు గంటలకా? ఆరు గంటలకా?" వాచీకేసి చూస్తూ అడిగాడు రంగనాథ్.

"అయిదున్నరకు. మరో అరగంటే ఉంది. ఫరవాలేదు. మనం బయలుదేరదాం. నేను మా బాస్‌తో చెప్పేసి వస్తాను" అంటూ లేచాను.

"రేపు నీకు ఆదివారం సెలవేగా." అడిగాడు రంగనాథ్.

"సెలవే! ఇప్పుడే వస్తాను" అంటూ మేనేజర్ గదిలోకి వెళ్ళి అరగంట ముందుగా పర్మిషన్ తీసుకొని బయటికొచ్చాను.

"పద పోదాం" అంటూ రంగనాథ్ పక్కనే ఉన్న సూట్‌కేస్ చేతిలోకి తీసుకొని బయటికి నడిచాను. రంగనాథ్ నాతోనే నడిచాడు. ఆఫీసు దాటి రోడ్డుమీదికి వచ్చాం.

"ఎక్కడ దిగావు" అడిగాను.

రంగనాథ్ నాకేసి సీరియస్‌గా చూస్తూ, "ఎక్కడో ఎందుకు దిగుతాన్రా. నేను ఇండియాకు వచ్చి పదిహేను రోజులైంది. హైదరాబాద్‌లో నిన్నటి దాకా మా అమ్మానాన్నలతో ఉన్నాను. సాయంత్రం రైల్లో బయలుదేరి పొద్దున్నే మద్రాసు వచ్చాను. అమెరికాలోని నా ఫ్రెండ్ సుధీర్ ఇంటికి వెళ్ళి వాళ్ళకు కొన్ని వస్తువులను ఇచ్చి భోజనం చేసి, అక్కడే విశ్రాంతి తీసుకొని నీ దగ్గరికి వచ్చాను. ఎల్లుండి పొద్దుటే విమానంలో బొంబాయి వెళ్తాను. అటునించి హైదరాబాద్ వచ్చి మరో వారం రోజులు అక్కడ గడిపి మళ్ళీ అమెరికా వెళ్ళిపోతాను. ఎల్లుండి పొద్దుటిదాకా నీ ఇంట్లో నా బస" అన్నాడు రంగనాథ్.

"ఏడిశావ్. నా ఇంట్లో నువ్వు ఒక్కక్షణం కూడా ఉండలేవులే. ఇల్లు ఇరుకు. దోమలు... మాకైతే మరోదారి లేదు కనుక అక్కడే దోమల్లా వాటితో కలిసిపోయి బతికేస్తున్నాం. అమెరికాలో ఏ.సి ఇళ్ళలో ఉంటూ, పట్టు పరుపుల మీద పడుకొని బతికిన నువ్వు తట్టుకోలేవురా. మంచి హోటలుకు వెళ్దాం. అక్కడ గది తీసుకుందాం, తరువాత మా ఇంటికి వెళ్ళి కాసేపు గడుపుదాం. మళ్ళీ రాత్రి హోటల్ గదిలో నిన్ను దింపి రేపు ఉదయం నీ గదికి నేను వచ్చేస్తాను. అది బాగుంటుంది" అన్నాను.

నేను చెప్పిందంతా తాపీగా విని, "చూడూ! నువ్వు కలకాలం రాజీపడి బతుకుతున్న ఇంట్లో నేను ఒక్కరోజు ఉండలేనంతటివాణ్ణి కానురా. కష్టాలు, సుఖాలు, గొప్ప, బీద, మురికివాడలు, పెద్దపెద్ద మేడలు ఈ ప్రపంచమంతటా ఉన్నాయి. అమెరికా అయినా, ఇంగ్లండయినా అక్కడ మేము మీరు చూడని వింతలోకంలో ఉంటున్నామనుకోవడం తప్పురా. అక్కడ పేదరికం ఉంది. నిరుద్యోగం ఉంది. నైతిక విలువలూ ఉన్నాయి. దుర్మార్గులూ ఉన్నారు. మోసాలు, హత్యలు, మానభంగాలు, ఆదరించే ఆత్మీయుల మనసులు ఉన్నాయి. ఇవెక్కడ లేవు చెప్పు. మనిషి తాను ఎక్కడ ఉంటే అక్కడి పరిస్థితులతో రాజీపడి బతకాల్రా. 'నేనిలాగే బతగ్గలను' అని భీష్మించుకు కూర్చుంటే బతుకే బరువవుతుంది. సో... హోటలు గది వద్దు. మీ ఇంట్లోనే, ఆ ఇరుకులోనే, వరండాలోనైనా– ఒక చాప ఇస్తే చాలు. నేను నీతోపాటు గడుపుతాను. అంతేకాదు, నేనిక్కడికి వచ్చింది మీతో గడపడానికేగాని ఆడంబరంగా ఉండడానికి కాదు" అన్నాడు రంగనాథ్ సుదీర్ఘంగా.

"అది కాదురా!..." అని ఇంకా ఏదో చెప్పబోతుంటే, "నువ్వేం చెప్పకు. తిన్నగా ఇంటికి పద" అన్నాడు రంగనాథ్.

"సరే నడు" అన్నాను.

"ఆటో పిలవనా." అడిగాడు రంగనాథ్.


"వద్దులే. దగ్గరే ఇల్లు. గట్టిగా నడిస్తే పది నిమిషాలు. ఆటోవాళ్ళు మనల్ని గుంజేస్తారు" అన్నాను నేను. నా జేబులో పది రూపాయలే ఉన్నాయి. ఇంకా మూడు రోజులు నెట్టాలి. అప్పుడు గానీ జీతాలు రావు. ఆటోకి పది రూపాయలు ఇచ్చేస్తే మూడు రోజులు గడపడం కష్టం. ఒకవేళ రంగనాథే ఇస్తానన్నా, వద్దని వారిస్తేగానీ తనకు తృప్తిగా ఉండదు. తీరా వాడు 'సరే ఇచ్చెయ్' అంటే కష్టం. అంతేకాదు, ఉదయం ఆఫీసుకు బయలుదేరుతున్నప్పుడే మంజులకు జ్వరంగా ఉందన్న



విషయం గుర్తు చేసింది భార్య. ఇప్పుడెలా ఉందో ఏమో? మందులు గ్రటా కొనాలంటే ఫార్మసీవాడిని అప్పు అడగాలి. 'ఈ దశలో జాగ్రత్తగా డబ్బుని వాడుకోవాలి' అనుకున్నాను.

"ఇల్లు దగ్గరేనా! పద నడిచేద్దాం" అంటూ వినవిన నడుస్తున్నాడు రంగనాథ్.

సంక్రాంతి పండుగ మరో వారం రోజులుంది కనుక రోడ్డుకు రెండువైపులా ఉన్న దుకాణాలు



చిత్రాలు: నర్సిం

రంగు దీపాల కాంతిలో జిగేలుమంటున్నాయి. షోకేసుల్లోని నిలువెత్తు బొమ్మలకు అందమైన బట్టలు తొడిగి జనాన్ని ఆకర్షించేలా చేశారు దుకాణందారులు. ఎక్కడ చూసినా డిస్కౌంటు సేల్సు. క్రిక్కిరిసిన జనంతో నడవడానికి కూడా దారి లేనంతగా ఉంది ఆ దారి.

రంగనాథ్ ఆ దుకాణాల కేసి చూస్తూ నడుస్తున్నాడు. నేను మాత్రం కళ్ళకు గంతలు కట్టిన గుర్రంలా తిన్నగా నడుస్తున్నాను.

"ఆ షోకేసు బొమ్మమీది డ్రెస్ చూశావా. బాగుంది కదూ." అడిగాడు రంగనాథ్, పరధ్యానంగా నడుస్తున్న నా భుజం మీద చెయ్యివేసి.

ఒక క్షణం ఆ బొమ్మకేసి చూసి "బాగుందిరా" అన్నాను.

"పండక్కి బట్టలు కొనేశావా." అడిగాడు రంగనాథ్.

"ఇంకా పది రోజులుందిగా. కొనడానికి ఇంకా టైముందిలే" అన్నాను నేను. ఈ పండక్కి బట్టలు కొనలేనని నాకు తెలుసు. ఇప్పటికే నెత్తిమీద కొంత అప్పు కూడా ఉంది. తండ్రి ఆరోగ్యం కోసం, చెల్లెలు పెళ్ళి కోసం, కుటుంబంలోని ఎదురు చూడని ఖర్చుల కోసం చేసిన అప్పులు మెల్లమెల్లగా తీరుస్తున్న నేను పండగ గురించి ఆలోచించలేను. అందుకే రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఇటూ అటూ చూడకుండా నడుస్తాను. కోరికలు మనసు లోనే ఉదయమై, మనసులోనే అస్తమిస్తాయి.

విశ్వనాథం తన కూతురికి కొన్న గౌను చిన్నదై పోయిందనీ, మంజులకు సరిగ్గా ఉంటుందనీ నాకిచ్చాడు. విశ్వనాథానికి నా కష్టాలు తెలుసు. ఒక్కసారే ఉద్యోగంలో చేరాము. "ఆ గౌనుకి ఎంత ఇవ్వాలో చెప్పు" అన్నప్పుడు విశ్వనాథానికి కోపం వచ్చింది.

"మన ఇద్దరి మధ్యా ఈ అభిమానాలు ఉండ కూడదురా" అన్నాడు విశ్వనాథం.

ఆ గౌను మంజులకు పండుగకు ఇస్తే చాలు. నాకూ, నా భార్యకూ ఆ ఆశలు ఏనాడో చచ్చిపోయాయి.

"నేను కూడా రేపు కొన్ని బట్టలు కొనుక్కోవాలిరా. మా ఆవిడకు కంచి పట్టుచీర కావాలట. అలాగే మావాళ్ళకూ, నాకూ తీసుకుంటాను" అన్నాడు రంగనాథ్.

"దాన్దేముందిలే. రేపు మార్నింగ్ వచ్చి కొనుక్కుందాం" అన్నాను.

మరో పది నిమిషాల్లో ఇల్లు చేరుకున్నాం. రంగనాథ్‌ను నా భార్యకు పరిచయం చేశాను. వరండాలోని పాత కుర్చీలో రంగనాథ్, ఎదురుగా ఉన్న స్టూలు మీద నేను కూర్చున్నాము. వాడి సూట్‌కేసు నా గదిలో ఉంచాను. మేము మాట్లాడు కుంటూ ఉన్నప్పుడే మంజుల అక్కడికి వచ్చింది. జ్వరం తగ్గిన ఛాయలు మంజుల మొహంలో కనిపించడంతో గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను.

"మా అమ్మాయి మంజుల" అని పరిచయం చేశాను. రంగనాథ్ మంజులను దగ్గరకు తీసుకొని ముద్దిచ్చి, ఆప్యాయంగా తల నిమిరి "స్వీట్ గర్ల్" అన్నాడు. ఇంతలో నా భార్య లోపలినుంచి "ఒక్కసారి ఇలా రండి" అనేలా సైగ చేసింది. నేను లేచి వంటింట్లోకి వెళ్ళాను.

"కాఫీ రెడీ. రాత్రి భోజనానికీ, రేపటికీ కూరలు లేవండీ. తీసుకురావడానికి డబ్బులు..." అంటున్న ఆవిడతో "వర్రీ అవకు. ఏర్పాటు చేస్తాను" అన్నాను. ఆవిడ ఆశ్చర్యంగా చూసింది. మా మధ్య దాపరికాలు ఉండవు. నా పరిస్థితి ఆవిడకు తెలుసు. 'ఎలా ఏర్పాటు చేస్తానో' అనుకుంటోంది. ఇంతలో కాఫీల పని పూర్తయింది.

మరో పది నిమిషాలలో అటకమీది పాత న్యూస్‌పేపర్లను తీసి కట్టకట్టి ఒక సంచీలో పెట్టాను. బరువు పది కిలోలదాకా ఉంటుంది. రంగనాథ్ మంజులతో నర్సరీ రైమ్స్ చెప్పించుకొని వింటున్నాడు. రెండు సంచీలలోకి ఆ పేపర్లను మళ్ళీ మార్చి, సంచీలు తీసుకొని బయటికి నడిచి, "రంగా, పది నిమిషాలలో వచ్చేస్తాను" అని చెప్పి పక్క వీధిలోని పాత పేపర్ల కొట్టుకు నడిచాను. మరో ఇరవై నిమిషాలలో ముప్పై రూపాయలు నా చేతికి వచ్చాయి. ఖాళీ సంచులలో ఒక దాంట్లో కొన్ని కూరలు కొన్నాను. సమస్య తీరింది.

నేను ఇంటికి వచ్చాక మా ఆవిడ పని ప్రారంభమైంది.

నా గురించీ, నా ఉద్యోగం గురించీ, పాత స్నేహితుల గురించీ మాట్లాడుతూ, "నీకు కేబుల్ కనెక్షనుంటే బి.బి.సి పెట్టు. న్యూస్ వస్తుంది"

> "మనం నిచ్చెనలం కాకూడదురా, ఆ నిచ్చెనల మీద ఎక్కేవాళ్ళం కావాలి. అనుక్షణం అవకాశాల కోసం వేటాడుతూ ముందుకు నడిచే తత్త్వం నాది. అందుకే హైదరాబాద్ నుంచి మస్కట్‌కు, మళ్ళీ అమెరికాకు వెళ్ళగలిగాను."

అన్నాడు రంగనాథ్.

నేను క్షణం తటపటాయించాను.

"ఎక్కడుంది టీవీ. లోపలా?" మళ్ళీ అడిగాడు రంగనాథ్.

"టీవీ లేదురా" అన్నాను.

"టీవీ లేదా!" ఆశ్చర్యంగా అడిగాడు రంగనాథ్.

లేదు. ఏడాది క్రితం ఒక పాత నలుపు, తెలుపు సెట్ కొన్నాను వెయ్యిరూపాయలకు. నా అదృష్టం బాగులేక నేను కొన్న రెండు నెలల లోపలే పిక్చర్ ట్యూబ్ పోయింది. దాన్ని అయిదు వందలకు అమ్మేశాను. రెండు మూడు టీవీలు చూశాను. అవి బాగులేవు. మళ్ళీ మంచిరోజులు వస్తే కలర్ టీవీ కొందామనుకొన్నాను" అని వివరంగా చెప్పాను.

"అది మంచి పని. ఇంకా బ్లాక్ అండ్ వైట్ ఏమిట్రా. గో ఫర్ కలర్" అన్నాడు.

అప్పుడే దోమల దండయాత్ర ప్రారంభమైంది.

దట్టంగా, రింగులు రింగులుగా పైకి లేచే పొగలా దోమలు మా చుట్టూ తిరుగుతున్నాయి.

"ఫ్యాన్ వేస్తే దోమలు తగ్గుతాయిరా" అన్నాడు రంగనాథ్ గోడమీది స్విచ్ బోర్డు కేసి చూస్తూ, మరుక్షణం చూరుకేసి చూసి, "అరెరె... ఫ్యాను లేదు కదూ" అన్నాడు.

"లేదు. లోపల గదిలో, అదే హాల్లో ఉంది. అక్కడ కూర్చుందాం రా" అన్నాను. ఇద్దరమూ హాల్లోకి వచ్చాం.

"ఎన్ని గదులున్నాయి" అడిగాడు రంగనాథ్.

"ఈ హాలు, వంటగది. ఆ చిన్న వరండా" అన్నాను.

"మరీ చిన్నది కదూ" అన్నాడు.

"వెయ్యి రూపాయలు అద్దె" అన్నాను.

"ఎక్కువా? తక్కువా? నాకిక్కడ అద్దెలు తెలీవు" అన్నాడు రంగనాథ్.

"అది నార్మల్ రెంట్‌రా. ఇండియాలో ధరలు పెరిగిపోయాయిరా. ఉన్నవాళ్ళకీ మధ్యతరగతికీ అగాధం ఎక్కువైపోయింది. మధ్యతరగతికీ, బీద వారికీ మధ్య దూరం తక్కువైపోయింది. ఇక్కడ చదువు, వైద్యం, బట్టలు, ఆహారం, అన్నీ కాస్ట్‌లీ. విదేశీ పెట్టుబడులు పెరిగి, విదేశీ వాణిజ్య సంస్థలు

మన దేశంలో వ్యాపారం ప్రారంభించడంతో ధరలు కూడా పెరిగిపోయాయి. ఎవరో గొప్పవాళ్ళవుతుంటే మనం పేదరికాన్ని అనుభవించాల్సిన పరిస్థితి వచ్చింది. అంతా విదేశీ అనుకరణ. వేరు సెనక్కాయలు, కొబ్బరినీళ్ళు కూడా ప్యాకెట్లలోకి ఎక్కుతున్నాయి. గజం భూమి ధర ఆకాశాన్ని అంటుతుంటే ఇంటి అద్దె పెరగక ఏమవుతుందిరా. పిల్లల మందులు కూడా కొనలేనంత దూరంలో ఉన్నామంటే ఏం చేస్తాం" అన్నాను.

"ఏమైనా ఇన్వెస్ట్ చేశావా? పొదుపు చేస్తున్నావా?" అడిగాడు రంగనాథ్.

"లేదురా. అది కుదరని పని. ఆదాయానికీ, అవసరమైన ఖర్చులకీ పొంతన లేదు. అడుగడుగునా ఆశలు చంపుకుంటూ బతకడానికి అవసరమైన ఖర్చులు మాత్రం పెడితేనే బతగ్గలను. అయినా, రోజురోజుకీ ధరలు పెరుగుతుంటే పొదుపు ఎక్కడ చేయగలంలే" అన్నాను.

"నిజమే. నీ గురించి నేను ఎక్కువగానే అంచనా వేసుకున్నాన్రా. నువ్వు జీవితంలో సెటిలయ్యావనుకున్నాను" అన్నాడు రంగనాథ్.

"కొందరు జీవితంలో చివరిదాకా సెటిల్ అవలేరు. కానీ, జీవితం గడిచిపోతుంది. చాలా మంది మధ్యతరగతి జీవితాలు అలాగే ఉంటాయి. ఎన్నో పనులు చెయ్యాలనుకుంటూనే జీవితాన్ని గడిపేస్తారు" అన్నాను.

"మనం నిచ్చెనలం కాకూడదురా, ఆ నిచ్చెనల మీద ఎక్కేవాళ్ళం కావాలి. చాలా కంపెనీలలో స్టాఫ్ నిచ్చెనల్లా ఉంటూ యాజమాన్యాన్ని పైకి

**నిచ్చెనలా మనుషులను మార్చుకుని పైకెగబాకుతూ వెళ్ళిన రంగనాథ్... మరి లేడనుకున్న విషయం తెలిసినప్పుడు, కిందికి రానంత ఎత్తుకు అందరినీ నిచ్చెనలు చేసుకొని ఎక్కి వెళ్ళిపోయాడా అనిపించడంతో నా కళ్ళు చెమ్మగిలాయి.**

తీసుకువెళ్తారు. 'నమ్మకస్థుడు, మంచివాడు, కష్టపడి పని చేస్తాడు, మా కంపెనీకి ఇతను ఎసెట్' అనే మాటలను నేను నమ్మను. అనుక్షణం అవకాశాల కోసం వేటాడుతూ ముందుకు నడిచే తత్వం నాది. అందుకే హైదరాబాద్ నుంచి మస్కట్‌కు, మస్కట్ నుంచి హైదరాబాద్‌కు, మళ్ళీ అమెరికాకు వెళ్ళగలిగాను" అన్నాడు రంగనాథ్.

"అందుకు కూడా అదృష్టం ఉండాలిరా. అవకాశాలు రావాలిగా."

"నిజమే. అదృష్టం ఉండాలి. అవకాశాలు రావాలి. కానీ, మన ప్రయత్న లోపం ఉండకూడదు కదరా! నువ్వేమన్నా ప్రయత్నాలు చేశావా?" అడిగాడు రంగనాథ్.

"చేశాను. కానీ, వాళ్ళు అడిగేటంత డబ్బు నాదగ్గర లేదు. పైగా నెల గడవడమే కష్టంగా ఉన్నప్పుడు అప్పు తీసుకుని మోసపోతే... తరువాత పరిస్థితి దారుణమైపోతుంది. అవన్నీ వదిలెయ్‌రా. నేను అదృష్టం మీద ఆధారపడుతున్నాను. మన టైమ్ మంచిదైతే ఏదో ఒక దారి ఆ భగవంతుడే చూపిస్తాడు. పైగా నేనెప్పుడూ పేదరికాన్ని చూసి భయపడలేదు. జీవన విధానాల్లో అదీ ఒకటి అనుకుంటాను" అన్నాను.

మా సంభాషణ జరుగుతుండగానే నా శ్రీమతి భోజనాలకు పిలిచింది. ఆనపకాయ ఆవపెట్టిన కూర చేసింది. దానికి తోడు కాకరకాయ ముద్ద పులుసు, పెరుగు పచ్చడి వగైరాలు. రంగనాథ్ ఎంజాయ్ చేస్తూ ఎంతో నెమ్మదిగా మరీమరీ వడ్డించుకొని భోజనం చేశాడు.

అమెరికాలో అన్నీ ఉన్నా... ఈ వంటకాలు మాత్రం మన ఇష్టం వచ్చినప్పుడు తినడానికి వీలుండదు. సీజన్లో వెజిటబుల్స్ దొరకాలి. అప్పుడే మన వంటకాలు మనకు ప్రాప్తం. మీ ఇంట్లో ఇప్పుడు తిన్న ఈ భోజనం మరో పది సంవత్సరాల దాకా నా మనసులో మిగిలిపోతుంది. ఇటీజ్ ఎ గ్రేట్ డిన్నర్' అంటూ నన్నూ, మా ఆవిడనూ ఆకాశానికి ఎత్తేశాడు. నా శ్రీమతి సిగ్గుపడిపోయింది.

"మనకు ఇవి మామూలు వంటకాలే. కానీ, అందుబాటులో లేనందున అవే అమెరికాలో అమూల్యమైనవి" అని చెప్పి, రేపు ఇంతకన్నా మంచి భోజనం ఉంటుందని హామీ కూడా ఇచ్చింది.

ఆ రాత్రి దోమల దండయాత్రను తట్టుకుని నిద్రపోయాడు రంగనాథ్.

నాకు మాత్రం నిద్ర రాలేదు. 'జీవితాలు ఎంత మారిపోయాయి' అనుకుంటూ ఉంటే, కన్ను మూసుకోవడానికి ఇష్టపడలేదు. బళ్ళో చదువుకున్నప్పుడు రంగనాథ్ కూడా నా లాగానే ఉండేవాడు. ఆర్థికంగా కూడా! కాకపోతే డిగ్రీ తర్వాత వాడు మరి కొన్ని కోర్సులు చదువుకుని కొంతకాలం హైదారాబాద్‌లో ఉద్యోగం చేశాడు. అంతవరకు నేనూ, రంగనాథ్ ఒకే స్థాయిలో ఉండేవాళ్ళం. తరువాత వాడి దశ తిరిగింది. బాగా ఎదిగిపోయాడు. నేను మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అనేలా మిగిలిపోయాను. చివరకు రంగనాథ్ విదేశాల్లోంచి నన్ను చూడడానికి వస్తే వాడికి ఆతిథ్యం ఇవ్వడానికి కూడా భయపడే పరిస్థితి నాది. న్యూస్ పేపర్లమ్మి కూరలు కొనే దయనీయమైన స్థితి! ఈ పరిస్థితిలో నేను ఎవరిని తిట్టగలను? జవాబు దొరకని ప్రశ్నలతో ఆ రాత్రంతా మేలుకొన్నాను.

కొంచెం దూరంలో నా శ్రీమతి కూడా కునుకు రాక అటూ ఇటూ పొర్లుతూ పడుకుంది.

ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని, అల్పాహారం తీసుకుని బజారు మీద పడ్డాం. జేబులో పది పదిహేను రూపాయలతో నేను, వేల రూపాయలతో వాడు!

"మంచి బట్టల షాపుకు వెళ్దాంరా" అన్నాడు రంగనాథ్.

తీసుకు వెళ్ళాను.

పట్టు చీరలు, పట్టు పంచలు, కాటన్ చొక్కాలు, తుండు గుడ్డలు, ఏవేవో కొనుక్కున్నాడు.

"బంగారం షాపుకు వెళ్దాంరా" అన్నాడు.

తీసుకువెళ్ళాను.

గోమేధికం ఉంగరం తనకు, వజ్రపుటుంగరం అతని భార్యకు కొన్నాడు. అలాగే ఇంకా కొన్ని వస్తువులు కొన్నాడు. చేతినిండా డబ్బుంటే ప్రతీ వస్తువూ అవసరమైనదిగా కనిపిస్తుంది. ఆ ప్రతి వస్తువూ రంగనాథ్ పెట్టెలోకి ఎక్కింది. మధ్యాహ్నం దాకా షాపింగ్ చేసిన తర్వాత "రంగా! ఇక్కడ ఒక మంచి హోటల్ తెరిచార్రా. శుభ్రంగా అక్కడ భోంచేసి ఇంటికి వెళ్దామా" అని అడుగుదామనుకున్నాను. కానీ, నా కుడి చెయ్యి ప్యాంటు జేబులోని పదిరూపాయల కాగితం మీద పడడంతో ఆ కోరిక మానుకున్నాను. పోనీ వాడే "రారా! హోటలుకు వెళ్దాం" అని పిలుస్తాడా అనుకున్నాను. కానీ, పిలవలేదు.

"ఇంటికి వెళ్ళి భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకొని, రాత్రి ఫ్లైట్‌కు బొంబాయి వెళ్ళడానికి టికెట్ బుక్ చేసుకుందాం" అన్నాడు రంగనాథ్.

"ఎల్లుండి పొద్దున్న వెళ్దాం అన్నావుగా." అడిగాన్నేను.

"అన్నాను. కానీ, రాత్రి వెళ్ళిపోతే మర్నాడు కాస్త టైం కలిసివస్తుంది. అక్కడ కొంచెం ఎక్కువ పనుంది కూడా. అందుకే నైట్ ఫ్లైట్ ట్రై చేద్దాం" అన్నాడు.

"ఒక విధంగా చూస్తే రంగనాథ్ వెళ్ళిపోవడమే మంచిది. రాత్రి మళ్ళీ భోజనం ఏర్పాటు చేయాలి. నిన్న రాత్రి, ఈ రోజు మధ్యాహ్నానికే కొన్న కూరలు ఖర్చయిపోయుంటాయి" అనుకున్నాను నేను.

షాపింగ్ పూర్తయి ఇంటికి వచ్చిన మా కోసం నా శ్రీమతి, కూతురు మంజుల వెయిట్ చేస్తున్నారు. మేమిద్దరం ఇంట్లోకి వచ్చి కాసేపు కూర్చున్నాం. రెండుగ్లాసుల నీళ్ళు మాకోసం ఖర్చయింది. కాళ్ళు కడుక్కుని భోజనానికి రమ్మంది నా శ్రీమతి. మళ్ళీ రకరకాల వంటకాలతో భోజనం. రంగనాథ్ ముద్ద ముద్దకు మా ఆవిడను పొగుడుతూ తింటున్నాడు. మంజుల కూడా రంగనాథ్‌తో సరదాగా కబుర్లు చెప్తోంది.

"అంకుల్! ఏమేం కొన్నారు" అడిగింది మంజుల.

రంగనాథ్ భోజనాలయ్యాక పెట్టె తెరిచి, తాను కొన్న వస్తువులను మా ఆవిడకు చూపిస్తున్నాడు.



కళ్ళు జిగేల్ మనే పట్టు చీరలు, నగలు... మా ఆవిడ ఎంతో ఆసక్తిగా చూస్తోంది. ఆవిడ మొహం కేసి చూసే ధైర్యం నాకు లేదు. ఆవిడ కొన్నేళ్ళ నుంచీ పట్టు చీర మీద ఆశ పెట్టుకుంది. అది నాకు తెలుసు. కానీ, ఆవిడ అడగలేదు. అలాగే బంగారం! పెళ్ళయిన దగ్గర్నుంచీ ఇంతవరకు ఒక పట్టు చీర కానీ, తులం బంగారం కానీ ఆవిడకు నేను పెట్టలేదు. ఆవిడకు చెయ్యలేకపోతున్నానని నా మనసులో బాధపడేవాడిని. "పట్టు చీరలు, బంగారాలు లేకపోతే బతకలేమా? దేశంలో ఎందరో ఒకపూట భోజనానికి కూడా నోచుకోలేని వాళ్ళున్నారు. వాళ్ళకన్నా మనం బెటర్ అనుకోవాలి" అని నా చేతకానితనాన్ని కప్పిపుచ్చే మాటలు ఆడేవాడిని.

మా ఆవిడ చీరలనూ, నగలను చూసి "చాలా మంచి సెలక్షన్" అంది.

"నాదేమీ లేదండీ? అంతా వీడి సెలక్షనే" అన్నాడు రంగనాథ్.

మా ఆవిడ నాకేసి చూసి నవ్వింది. ఆ నవ్వును చూసిన నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. మంజుల కూడా బొమ్మల కేసి ఆశగా చూసింది. తాను మంజులకు ఒక మంచి బొమ్మ కూడా కొనలేకపోయాడు. అంతా కాస్ట్లీ. మంచిరోజులు వస్తే తీర్చుకోవలసిన కోరికల లిస్టు పొడవు రోజురోజుకూ పెద్దదైపోతోంది. 'ఈ లెక్కలో జీవితం సాగితే ఆ లిస్టులోని కొన్ని కోరికలైనా తీరడానికి మరో జన్మ ఎత్తాల్సి ఉంటుందేమో' అనుకున్నాను.

నగలు, చీరలు మళ్ళీ పెట్టెలోకి వెళ్ళిపోయాయి. వరండాలో పడక సిద్ధం చేశాను. రంగనాథ్ అక్కడ నిద్రకు ఉపక్రమించాడు. నేను, శ్రీమతి, మంజుల హాల్లో పడుకున్నాం. బయట ఎండ దంచేస్తోంది మధ్యాహ్నం మూడు గంటలైనా. నా ఆలోచనలు రంగనాథ్ ఆర్థిక పరిస్థితి మీద, అతను విచ్చలవిడిగా పెట్టిన ఖర్చుల మీదే ఉన్నాయి. జేబులో చెయ్యి పెట్టడానికే భయపడే బతుకు నాది. కానీ, రంగనాథ్ అయిదువందల రూపాయల కాగితాలనే బయటికి తీశాడు. నేను మొదటిసారిగా అయిదు వందల



రూపాయల నోటు రంగడి దగ్గరే చూశాను. నా కళ్ళలో మళ్ళీమళ్ళీ నగలకేసీ, పట్టు చీరలకేసీ చూసిన నా శ్రీమతి చూపులే కనిపించాయి. ఏనాటికైనా నేను కూడా బాగా డబ్బు సంపాదించి నా భార్యా పిల్లలకు కావలసిన వస్తువులన్నీ కొనివ్వాలి అనుకున్నాను. సంకల్పం చాలామందికి ఉంటుంది. కానీ, సాధ్యపడేది ఎందరికో?

రంగనాథ్ గురకలు పెట్టి నిద్రపోతున్నాడు. మంజుల వాళ్ళ అమ్మకు అతుక్కుపోయి నిద్ర పోతోంది. మళ్ళీ నా ఆలోచనలు రంగనాథ్ మీదికి వెళ్ళాయి. చిన్నప్పుడు ఇద్దరం కష్టపడిన వాళ్ళమే. అప్పటినుంచి పెనవేసుకున్నది మా స్నేహం. ఇప్పుడు వాడు కుబేరుడిలా ఉన్నాడు. నా పరిస్థితి చూశాడు కూడా. వెళ్ళిపోయేముందు నా కోసం ఏమీ ఇవ్వకపోయినా, కనీసం నా శ్రీమతికీ, మంజులకు ఏమన్నా ప్రజంట్ చేస్తే... ఛీఛీ... ఏమిటీ పాడు ఆలోచనలు. ఎంత పేదరికంతో బతుకుతున్నా ఎవరో మిత్రుడిచ్చే ప్రజంట్స్ కోసం తహతహలాడే స్థాయికి నేను దిగజారిపోయానా అనుకున్నాను. మళ్ళీ నా మనసే గుర్తు చేసింది, నా ఎదురు చూపు తప్పుకాదని! రెండు రోజులు ఇంట్లో ఉంచుకొని భోజనంతో పాటు సమస్త సుఖాలనూ ఏర్పాటు చేసిన నా కుటుంబానికి కొంచెం సాయం చేస్తే ఏం' అనుకుంది నా మనసు.

మెల్లగా కునుకు పట్టింది. లేచేసరికి సమయం ఆరుగంటలు. మరో అరగంటలో చకచకా బయలు దేరాడు రంగనాథ్. నా శ్రీమతికి, మంజులకు తన కృతజ్ఞతలు, ఆశీస్సులు తెలుపుతూ సెలవు తీసుకున్నాడు.

ఇద్దరం ఆటో ఎక్కాం.

ఏర్‌పోర్టుకు వచ్చాం.

అక్కడ నైట్ ఫ్లయిట్‌లో సీటు కన్‌ఫర్మ్ చేసుకున్నాడు రంగనాథ్. అక్కడే బుక్‌స్టాల్‌లో పుస్తకాలు చూస్తూ కాసేపు గడిపాం.

చటుక్కున ఏదో మరిచిపోయిన వాడిలా తన బ్రీఫ్ కేస్ తెరిచి ఒక కవరు బయటికి తీసి నా చేతికి అందిస్తూ, "ఇది మంజులకు ఇవ్వు. మరిచి పోయాను" అన్నాడు రంగనాథ్.

"ఏమిటిది?" అడిగాను.

"డబ్బు... నూటొక్కరూపాయలు - సంక్రాంతికి గౌను కొనుక్కోడానికి" అన్నాడు రంగనాథ్.

మరికొద్ది సేపట్లో రంగనాథ్ విమానం ఎక్కేశాడు. విమానం గాలిలోకి లేచింది.

ఏర్‌పోర్ట్ బయటికి వచ్చిన నేను మరో గంట సేపు అక్కడ బస్సుకోసం వెయిట్ చేసి, చివరకు రద్దీగా ఉన్న బస్సులో ఫుట్‌బోర్డు మీదే నిలబడి ప్రయాణం చేసి ఇంటికి వచ్చాను.

నా కోసం నా శ్రీమతి, మంజుల ఎదురు చూస్తు న్నారు. మంజుల చేతికి రంగనాథ్ ఇచ్చిన కవరు ఇచ్చాను. దాన్ని తెరిచి చూసిన మంజుల, "హయ్యా! డబ్బు" అన్నదీ ఆనందంగా కేరింతలు కొడుతూ.

"మీ స్నేహితుడిచ్చిన డబ్బు కదూ" అంది శ్రీమతి.

"అవును" అన్నాన్నేను.

"వెళ్ళిపోతూ ఇంకేమైనా అన్నారా మీ ఫ్రెండ్." అడిగింది శ్రీమతి.

"భరించలేనంత ఆర్థిక ఒత్తిడి ఉంటే నాకు ఉత్తరం రాయరా... చేతనైనంత సహాయం చేస్తాను అన్నాడు."

"ఏమిటో ఈ మాటలు. ఎదుటివారి సానుభూతి మీద, సహాయాలమీద బతకడం కన్నా పేదరికంతో రాజీపడి స్వతంత్రంగా బతకడంలో ఒక తృప్తి ఉంటుందండీ! మనం ఇరుకు ఇంట్లో ఉంటూ, సాధారణమైన ఆహారం తింటూ, అంతంత బట్టలు తొడుక్కుంటున్నా, అమెరికా నుంచి వచ్చిన మీ స్నేహితుడు మనతోపాటే ఉన్నాడు. తిన్నాడు. సో... మన జీవన విధానం అతనికి ఆమోదయోగ్య మైనదిగా కనిపించిందిగా! మరి మనం మాత్రం మన జీవితాలను చూసుకొని అసహ్యించుకుంటూ, ఇంకా ఏవో అనుభవించాలని ఐశ్వర్యం కోసం పాకు లాడడం ఎందుకో? వచ్చిన ఐశ్వర్యాన్ని కాదనం. రాని ఐశ్వర్యాన్ని పొందడానికి ప్రయత్నాలు చేయడం మానం. రానప్పుడు సర్వం పోయినట్లు కృంగిపోం. ఉన్నదే మన సంపద అనుకుంటాం. ఆస్తిని దాచుకుని మురిసిపోయేవాళ్ళు కొందరు. ఆస్తిని మంచి పనులకు వినియోగిస్తూ దాచుకొని మురిసిపోయే వాళ్ళు మరికొందరు. ఆస్తిని సంపాదించడం కోసం ప్రయత్నం చేస్తూ మురిసిపోయేవాళ్ళు ఇంకా కొందరు. ఆస్తి అనే మాట గురించి ఆలోచించకుండానే జీవితాన్ని చాలించేవాళ్ళు ఎందరో...

మీ స్నేహితుడు మంజుల కిచ్చిన వంద రూపాయల బహుమతి వల్ల అతను పొందిన తృప్తి కన్నా మనం అతనికి ఇచ్చిన ఆతిథ్యం వల్ల పొందే తృప్తి ఎక్కువండీ" అంది మా శ్రీమతి.

ఆ రాత్రంతా రంగనాథ్ చెప్పిన మాటలే గుర్తుకు వచ్చాయి. "మనం నిచ్చెన కాకూడదురా, నిచ్చెన మీద నడిచే వాళ్ళం కావాల్రా" అన్న ఆ మాటలలోని అంతరార్థం నాకు అర్థమైంది. మద్రాసులో తన స్టే నా ఇంట్లో చెయ్యడం వల్ల నేను నిచ్చెననయ్యాను. మూడు నాలుగు వేల రూపాయలు పొదుపు చేసి వందరూపాయలు ముద్దుగా నా కూతురు పేరిట ఇచ్చి స్నేహ సౌరభాన్ని వెదజల్లుతూ వెళ్ళిపోయిన రంగనాథ్ తెలివికి జోహార్లు చెప్పాను. స్నేహం పేరిట స్వతంత్రంగా నాతో మర్యాదలు చేయించు కున్నాడు రంగనాథ్.

నా కష్టాలను స్వయంగా చూసిన ఆ ఫ్రెండ్, 'రేయ్! రంగా! నువ్వు కష్టపడుతున్నావు కదా. ఇదిగో ఈ డబ్బు, ఫ్యాను కొనుక్కో.. టీవీ కొనుక్కో' అని ఇచ్చాడా. లేదు. మనసు రాలేదు. కానీ, నేను... వాటిని ఎదురుచూడలేదు కూడా. అయినా, "భరించరాని కష్టాలు వస్తే నన్ను మరిచిపోకురా" అన్నాడే ఆ మాటలు... మనిషిని ఇరకాటంలో పెట్టేవి అనుకున్నాను.

కునుకులోకి జారిపోయాను.

కష్టాలతో రాజీపడిన నేను రంగనాథ్ సాయం అర్థించే రోజులు రావని నమ్ముతూ నిద్రపోయాను.

మర్నాడు పేపర్లో వచ్చిన వార్త చూసి షాక్ తిన్నాను.

దిగ్భ్రాంతి నుంచి తేరుకోవడానికి చాలా సేపు పట్టింది. మద్రాసు నుంచి బయలుదేరిన బొంబాయి వెళ్ళే విమానం ప్రమాదానికి గురైందనీ, అందులోని ప్రయాణికులు అందరూ మరణించారని తెలియడంతో రంగనాథ్ నా కళ్ళముందు మెదిలాడు. అతను కొన్న పట్టు చీరలు, నగలు, అన్నీ అతనితోనే పోయాయి.

నిచ్చెనలా మనుషులను మార్చుకుని పైకెగ బాకుతూ వెళ్ళిన రంగనాథ్... మరిలేడనుకున్న విషయం తెలిసినప్పుడు, కిందికి రానంత ఎత్తుకు అందరినీ నిచ్చెనలు చేసుకొని ఎక్కి వెళ్ళిపోయాడా అనిపించడంతో నా కళ్ళు చెమ్మగిలాయి. అతను ఎక్కిన ఆఖరి నిచ్చెన మెట్టు నేనే కాగలిగినందుకు మరోసారి నా కళ్ళు వర్షించాయి. ■